## క్లుప్తంగా

### సాయినాథునికి విశేష పూజలు



ప్రత్యేకాలంకరణలో బాబా

**పొదలకూరు :** పట్టణంలోని శిరిడీ సాయిబాబా మందిరంలో అర్చకులు గురువారం విశేష పూజలు నిర్వహించారు. ఉదయం అభిషేకాలు, అష్టోత్తర, సహస్రనామ పూజలు, మధ్యాహ్నం భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. శాశ్వత ఉభయకర్తల గోత్రనామాలతో పూజలు, సాయంత్రం మందిరంలో భజనలు, రాత్రి పల్లకిసేవ గావించారు. శేజ్ హారతితో పూజా కార్యక్రమాలు ముగిశాయి.

### అర్థమయ్యేలా విద్యాబోధన ఉండాలి



మాట్లాడుతున్న ఏఎంఓ సుధీర్‌బాబు

**మనుబోలు :** విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో విద్యాబోధన ఉండాలని ఎస్ఎస్‌ఏ ఏఎంఓ సుధీర్‌బాబు అన్నారు. మండలంలోని వెంకన్నపాళెం ప్రాథమిక పాఠశాలను ఆయన గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బోధన చేసే ముందు ఉపాధ్యాయుడు లెసన్ ప్లాన్ కలిగి ఉండాలన్నారు. అనంతరం మండల వనరుల కేంద్రంలో రికార్డులు పరిశీలించారు. ఆయన వెంట సీఆర్‌ఎంటీ శ్రీనివాసులు, చెంచురామయ్య పాల్గొన్నారు.

### అలరించిన కళా సంబరాలు

**నెల్లూరు(బృందావనం):** పురమందిర ప్రాంగణంలోని వర్ధమాన సమాజ హాల్లో శాంతి కల్చరల్స్ అధ్యక్షుడు అమానుల్లాఖాన్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన జానపద కళా సంబరాలు అలరించాయి. పండరి భజన గురువులు తంబిశెట్టి కృష్ణదాస్, శ్రీకాంత్‌యాదవ్ శిష్య బృందం ప్రదర్శించిన పండరి భజనలు.. కోలాట గురువులు పాశం కోటేశ్వరమ్మ, వంశీకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో కోలాట ప్రదర్శనలు, జానపద నృత్యాలు ఆకట్టుకున్నాయి. గాయకుడు దోస్త్‌బాషా ఆలపించిన గీతాలు మైమరపించాయి. చెన్నై హాస్పిటల్స్ ఇన్ఫర్మేషన్ సెంటర్ అధినేత రమేష్‌బాబు, ప్రపంచ తెలుగు సమాఖ్య నెల్లూరు ప్రాంత అధ్యక్షుడు బలరామయ్యానాయుడు, బుల్లితెర నటుడు మురళీ మోహన్‌రావు, గౌస్‌బాషా, సుబ్బారావు, రాధాకృష్ణ పాల్గొన్నారు.

# చేనేత కుటుంబాల సంక్షేమానికి కృషి

- రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి



మగ్గం పరికరాలను చేనేత కార్మికులకు అందజేస్తున్న మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

**వెంకటాచలం :** రాష్ట్రంలో చేనేత కుటుంబాల సంక్షేమానికి ప్రభుత్వం అన్నివిధాలా కృషి చేస్తోందని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని ఎర్రగుంట వద్ద కమ్యూనిటీ హాలులో వెంకటాచలం బ్లాక్ లెవల్ క్లస్టర్ పరిధిలోని చేనేత కుటుంబాలకు డబ్బా వైండింగ్ మిషన్, మగ్గం పరికరాలను మంత్రి కాకాణి చేతుల మీదుగా గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కాకాణి మాట్లాడుతూ ప్రతీ ఏటా చేనేత కుటుంబాలకు నేతన్న నేస్తం పథకం ద్వారా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రూ.24 వేలు అందజేస్తున్నట్లు చెప్పారు. అలాగే హత్‌ఖర్గ సమవర్ధన్ సహాయత పథకం ద్వారా కేంద్ర ప్రభుత్వ భాగస్వామ్యంతో వెంకటాచలం, మనుబోలు మండలాలకు చెందిన 98 చేనేత కుటుంబాలకు రూ.43 లక్షల విలువైన మగ్గం పరికరాలను సబ్సిడీతో అందజేస్తున్నామని తెలియజేశారు. చేనేత కుటుంబాలకు అండగా నిలవాలనే ఆలోచనతో కేంద్ర ప్రభుత్వ భాగస్వామ్యంతో పాటు రాష్ట్ర ప్రభుత్వ వాటాను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎప్పటికప్పుడు విడుదల చేస్తూ సబ్సిడీపై మగ్గం పరికరాలు అందజేస్తున్నారని తెలిపారు. చేనేత కార్మికులు సులభతరంగా పని చేసుకునేందుకు వీలుగా మోటరైజ్డ్ మిషనరీ పరికరాలను పంపిణీ చేస్తున్నామని వివరించారు. రాష్ట్రంలో ఏ వర్గాన్ని విస్మరించకుండా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని కొనియాడారు. సంక్షేమ అమలులో అర్హతే ప్రామాణికంగా తీసుకుంటున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో చేనేత జౌళిశాఖ సహాయ సంచాలకుడు ఆనంద్‌కుమార్, చేనేత కార్మికుల సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజారోగ్య సంరక్షణకే ఆరోగ్య సురక్ష

- అదనపు డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఖాదర్‌వలి



వైద్య సిబ్బందికి సూచనలిస్తున్న ఖాదర్‌వలి

**కొడవలూరు :** ప్రజారోగ్య సంరక్షణ కోసమే రాష్ట్ర ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రవేశ పెడుతోందని అదనపు డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఖాదర్‌వలి తెలిపారు. కొడవలూరు పీహెచ్‌సీ ఆవరణలో జగనన్న ఆరోగ్య సురక్షపై వైద్య సిబ్బందికి ఆయన గురువారం అవగాహన కల్పించారు. వైద్య సిబ్బంది ప్రతి ఇంటికీ వెళ్లి ఆరోగ్య స్థితిగతులను నమోదు చేస్తారన్నారు. 30 నుంచి నలుగురు వైద్యులతో గ్రామాల వారీగా వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాల్సి ఉందన్నారు. ఇందులో తహసీల్దార్, ఎంపీడీఓలతో పాటు వివిధ శాఖల సిబ్బంది సహకారం ఉంటుందని చెప్పారు. ఎంపీడీఓ పి.సుబ్రహ్మణ్యం, పీహెచ్‌సీ వైద్యాధికారులు ఎం.రామకృష్ణ, జి.బాలచంద్రబాబు, సీహెచ్‌ఓ టి.సోమశేఖర్, పీహెచ్‌ఎన్ శైలజ పాల్గొన్నారు.

### రేపు వేలంపాట

**కోవూరు(విడవలూరు) :** మండలంలోని రామతీర్థం పంచాయతీ పరిధిలో ఉన్న చవిటి చేను కోనేరు, చాకిరేవు చేపల గుంతకు శనివారం మధ్యాహ్నం బహిరంగ వేలంపాట జరుగుతుందని పంచాయతీ కార్యదర్శి సుమన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రామతీర్థం గ్రామ సచివాలయంలో జరిగే వేలంపాటలో ఆసక్తి గల వారు పాల్గొనాలని కోరారు.

### బాలకార్మిక చట్టాలపై అవగాహన

**కోవూరు :** మండలంలోని ఇనమడుగు సెంటర్‌లో బాల కార్మిక చట్టాలపై నెల్లూరు సహాయ కార్మిక కమిషనర్ గౌస్‌బాషా గురువారం అవగాహన కల్పించారు. చిన్నారులను పనిలో పెట్టుకోవడం నేరమని, అలా చేస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామన్నారు.

# అర్హతే ప్రామాణికంగా పింఛన్ల పంపిణీ



తోటపల్లిగూడూరు : వరకవిపూడిలో నూతన పింఛన్లు అందుకున్న లబ్ధిదారులు

**ముత్తుకూరు :** వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రాజకీయాలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా కొత్త పింఛన్లను మంజూరు చేస్తోందని జెడ్పీటీసీ సభ్యుడు బందెల వెంకటరమణయ్య అన్నారు. మండలంలోని బ్రహ్మదేవి సచివాలయంలో కొత్తగా మంజూరైన 37 పింఛన్లను లబ్ధిదారులకు గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సంక్షేమ పథకాల అమలులో అర్హతే ప్రామాణికంగా పాలన సాగిస్తున్న ఘనత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. సర్పంచ్ వెందోటి సుధాకర్, మాజీ సర్పంచ్ కట్టా సుబ్రహ్మణ్యం, కార్యదర్శి వాసుదేవరావు, నాయకులు జమీల్‌బాషా, పంట సాయికుమార్‌రెడ్డి, షేక్ మస్తాన్, గ్రామ వలంటీర్లు పాల్గొన్నారు.

**కొత్త పింఛన్ల పంపిణీ**

**పొదలకూరు :** మండలంలోని మహ్మదాపురం గ్రామంలో కొత్తగా మంజూరైన పింఛన్లను ఉప సర్పంచ్ కరిపరెడ్డి కృష్ణారెడ్డి చేతులమీదుగా సచివాలయ సిబ్బంది గురువారం పంపిణీ చేశారు. 18 వృద్ధాప్య, 3 దివ్యాంగ పింఛన్లను అందజేశారు. ఈ సందర్భంగా ఉప సర్పంచ్ మాట్లాడుతూ అర్హులైన వారు సచివాలయంలో దరఖాస్తు చేసుకుంటే పార్టీలకతీతంగా పింఛన్లు మంజూరు అవుతున్నట్లు వెల్లడించారు.

**కుల, మత, పార్టీలకతీతంగా..**

**తోటపల్లిగూడూరు :** సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో కుల, మత, పార్టీలకతీతంగా అర్హతే ప్రామాణింగా సామాజిక పింఛన్లను అందిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఉప్పల శంకరయ్యగౌడ్ పేర్కొన్నారు. మండలంలోని వరకవిపూడి గ్రామంలో కొత్త పింఛన్లను ఆ పార్టీ జిల్లా సంయుక్త కార్యదర్శి ఇసనాక రమేష్‌రెడ్డితో కలిసి శంకరయ్యగౌడ్ గురువారం లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తోటపల్లిగూడూరు మండలానికి సంబంధించి గతంలో 7,685 పింఛన్లను అందిస్తుండగా మరో 433 కొత్త పింఛన్లను మంజూరు చేశారన్నారు. వరకవిపూడి పంచాయతీలో 19 కొత్త పింఛన్లతో కలిపి మొత్తం 421 పింఛన్లను అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో స్థానిక వైఎస్సార్‌సీపీ నేత కూరపాటి కృష్ణారెడ్డి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



ముత్తుకూరు : బ్రహ్మదేవిలో నూతన పింఛన్లు అందజేస్తున్న నాయకులు



పొదలకూరు : మహ్మదాపురం గ్రామంలో..

# క్రీడల్లో రాణిస్తే ఉద్యోగావకాశాలు

**ఇందుకూరుపేట :** క్రీడల్లో రాణిస్తే ఉద్యోగావకాశాలు మెండుగా ఉంటాయని కొత్తూరు జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం మల్లికార్జున అన్నారు. ఈ మేరకు గురువారం పాఠశాల ఆవరణలో స్కూల్ గేమ్స్‌ను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తొలిరోజు దాదాపు 110 మంది విద్యార్థులు వివిధ క్రీడల్లో పాల్గొన్నారని తెలిపారు. కోఆర్డినేటర్ అరోరా, వివిధ పాఠశాలలకు చెందిన వ్యాయామ ఉపాధ్యాయులు ముజీర్, జ్యోతి, పల్లవి, ప్రసాద్, వెంకటకృష్ణ, సుందర్‌బాబు, లక్ష్మయ్య, పాల్గొన్నారు.



ఇందుకూరుపేట: కొత్తూరు జెడ్పీ పాఠశాలలో..

**ముగిసిన మండలస్థాయి పోటీలు**

**పొదలకూరు :** స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు మండలంలోని మహ్మదాపురం డీఎస్సార్ జెడ్పీహైస్కూల్లో జరిగిన మండల స్థాయి క్రీడాపోటీలు గురువారం ముగిశాయి. అండర్-17కు సంబంధించి బాలుర విభాగం రన్నింగ్(800 మీ)లో డి.హేమంత్(మహ్మదాపురం), కార్తీక్(మహ్మదాపురం), హర్షవర్ధన్(పొదలకూరు, బాయ్స్) ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. బాలికల విభాగంలో (800 మీ) రన్నింగ్‌లో చెంచుకీర్తన(మహ్మదాపురం), కావేరి(ఇనుకుర్తి), జాహ్నవి(మహ్మదాపురం), హైజంప్ బాలుర విభాగంలో ఎం.విశ్వాస్(విజేత స్కూల్, పొదలకూరు), హేమంత్(మహ్మదాపురం), ట్రిపుల్ జంప్ బాలుర విభాగంలో వెంకటసాయి(మహ్మదాపురం), కార్తీక్(మహ్మదాపురం), కబడ్డీ బాలురలో మహ్మదాపురం విద్యార్థులు ఆరీఫ్, ప్రసన్న సంతోష్, పొదలకూరు బాయ్స్ విద్యార్థులు హర్షవర్ధన్, సతీష్, మనోగ్నసాయి ప్రతిభ చూపారు. అలాగే అండర్-14 విభాగంలో (600 మీ) రన్నింగ్‌లో రేణుక(మహ్మదాపురం), మహాలక్ష్మి(ఇనుకుర్తి), మౌనిక(తోడేరు), బాలుర విభాగంలో హరిచరణ్(పొదలకూరు బాయ్స్), వర్షిత(విరువూరు), మస్తాన్‌అభిషేక్(మహ్మదాపురం), కబడ్డీ బాలికల విభాగంలో లక్ష్మీలహరి, లాస్య, మహాలక్ష్మి(ఇనుకుర్తి), శైలజ, షఫియా, పావనిఅక్షిత, మహాలక్ష్మి(మహ్మదాపురం) జిల్లాస్థాయి క్రీడలకు అర్హత పొందినట్లు పాఠశాల పీడీ విజయవిశ్వేశ్వరన్ తెలిపారు.

➡ **మనుబోలు :** స్కూల్ ఫెడరేషన్ గేమ్స్‌లో భాగంగా స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో గురువారం రెండో రోజు క్రీడాకారుల ఎంపికలు నిర్వహించారు. మండల స్థాయిలో వాలీబాల్, 100, 200, 400, 800 మీటర్ల పరుగు పందెం, షాట్‌పుట్, లాంగ్ జంప్, హైజంప్, డిస్కస్‌త్రో, జావెలిన్ త్రో పోటీలు నిర్వహించి నియోజకవర్గ స్థాయి క్రీడాకారులను ఎంపిక చేశారు. ఈనెల 21, 22, 23వ తేదీల్లో పొదలకూరులో నియోజకవర్గ స్థాయి పోటీలు నిర్వహిస్తారని ఎంఈఓ రమేష్ తెలిపారు. పీడీలు ప్రమీలరాణి, సరిత, కామాక్షి, మురళి, మధుసూదన్‌రావు ఉన్నారు.

**యోగాతో ఏకాగ్రత**

**బుచ్చిరెడ్డిపాళెం :** యోగాతో విద్యార్థుల ఏకాగ్రత పెరుగుతుందని పెనుబల్లి జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం అనంతకృష్ణ అన్నారు. ఈ మేరకు స్థానిక పాఠశాలలో రెండో రోజు గురువారం స్కూల్ గేమ్స్ నిర్వహించారు. దాదాపు 150 మంది విద్యార్థులకు వివిధ క్రీడలతో పాటు అథ్లెటిక్స్, యోగా నిర్వహించామన్నారు. ప్రతిభ చూపిన వారు 20న జరిగే నియోజకవర్గ స్థాయి పోటీలకు హాజరవుతారన్నారు.



పొదలకూరు : క్రీడాపోటీల్లో విద్యార్థులు



మనుబోలు : వాలీబాల్ ఆడుతున్న విద్యార్థులు



బుచ్చిరెడ్డిపాళెం: యోగా చేస్తున్న చిన్నారి

**క్రీడలపై మక్కువ చూపాలి**

**కోవూరు(విడవలూరు) :** విద్యార్థులు చదువుతో పాటు క్రీడల పట్ల మక్కువ చూపాలని విడవలూరు ఉన్నత పాఠశాల పీడీ దిలీప్ అన్నారు. విడవలూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో మండలస్థాయి క్రీడా పోటీలను గురువారం ప్రారంభించారు. పీడీలు కృష్ణ, సురేష్, మంజువాణి పాల్గొన్నారు.

# రెండు బైక్‌ల ఢీ

- ముగ్గురికి గాయాలు

**బుచ్చిరెడ్డిపాళెం :** నగర పంచాయతీ పరిధిలోని సెయింట్ మేరీస్ కాలేజీ సమీపంలో ముంబై జాతీయ రహదారిపై గురువారం రెండు బైక్‌లు ఢీకొన్న ప్రమాదంలో ముగ్గురు గాయపడ్డారు. స్థానికుల కథనం మేరకు.. బుచ్చిరెడ్డిపాళెం నుంచి ఓ యువకుడు బైక్‌పై నెల్లూరు వెళ్తుండగా వెనుక నుంచి మరో బైక్‌పై ఇద్దరు కాలేజీ విద్యార్థులు వేగంగా వచ్చి ఢీకొన్నారు. ప్రమాదంలో ముగ్గురూ కింద పడటంతో గాయాలయ్యాయి. వీరిని 108 వాహనంలో బుచ్చి సీహెచ్‌సీకి తరలించారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు అందలేదు. పూర్తి సమాచారం తెలియాల్సి ఉంది.

# పౌష్టికాహారంతోనే ఆరోగ్యం



పొదలకూరు : సూచనలు ఇస్తున్న అంగన్‌వాడీలు, మహిళా పోలీస్

**కొడవలూరు :** పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా గర్భిణులు, బాలింతలు ఆరోగ్యంగా ఉండొచ్చని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వి.పద్మావతి సూచించారు. మండలంలోని రామాపురం ఎన్టీఆర్ కాలనీలో పోషణ్ మహా కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు రక్తహీనత బారిన పడకుండా మంచి ఆహారం తీసుకోవాలన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలు చెంచమ్మ, పావని, అఫ్రిన్ పాల్గొన్నారు.

**పౌష్టికాహారం తీసుకోవాలి**

**పొదలకూరు :** గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవాలని వెంకటాచలం ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎం.జ్యోతిలక్ష్మి పేర్కొన్నారు. మండలంలోని మొగళ్లూరులో పోషణ్ మాసోత్సవాలను గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గర్భిణులు రాగులు, జొన్నలు, సజ్జలు, వేరుశనగ చిక్కీలు, ఆకుకూరలు, కోడిగుడ్లను సమపాళ్లలో తీసుకోవాలన్నారు. మహిళా పోలీస్ చాందిని పలు సూచనలు చేశారు. సర్పంచ్ ఎం.ఓబుల్‌రెడ్డి, అంగన్‌వాడీ టీచర్లు పి.మీనమ్మ, ఎస్.పెంచలలక్ష్మి, డి.లావణ్య పాల్గొన్నారు.





ఇందుకూరుపేట: ఆకట్టుకున్న కూరగాయల రంగోలి

**సద్వినియోగం చేసుకోవాలి**

**ఇందుకూరుపేట :** అంగన్‌వాడీ కేంద్రాల్లో ఇచ్చే పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఏసీడీపీఓ రాజ్యలక్ష్మి కోరారు. ఇందుకూరుపేటలోని అంగన్‌వాడీ కేంద్రంలో పోషకాహార మాసోత్సవాలను గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు బలవర్ధకమైన ఆహారం తీసుకోవాలన్నారు. సూపర్‌వైజర్లు అమ్మణమ్మ, సుబ్బమ్మ, మంజుల, రంగమ్మ, సుబ్బరత్నమ్మ, మంజుల, శిరీషా పాల్గొన్నారు.

# ఘనంగా హిందీ దివస్



ఇందుకూరుపేట: ప్రముఖుల వేషధారణలో విద్యార్థులు

**కొడవలూరు :** స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో హిందీ దివస్ కార్యక్రమాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు జాతీయ సమైక్యత, సమగ్రతలపై వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. తొలుత విద్యార్థినులు జాతి సమైక్యతను చాటేలా వేసిన సాంప్రదాయ నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా పాఠశాల హెచ్‌ఎం కె.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ స్వాతంత్ర్య పోరాటంలో భాష ప్రధాన పాత్ర పోషించిందని తెలిపారు. కార్యక్రమంలో హిందీ ఉపాధ్యాయులు ఏవీ నారాయణరావు, ఎస్కే.సాబీర్‌బాషా, ఉపాధ్యాయులు బి.రవీంద్రకుమార్, ఆర్.హేమలత, ఎస్కే.ఖాదర్‌బాషా, శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**జాతీయోద్యమంలో హిందీ కీలకపాత్ర**

**ముత్తుకూరు :** జాతీయోద్యమంలో హిందీ భాష కీలకపాత్ర పోషించిందని, అఖిల భారతాన్ని ఏకతాటిపై నడిపి, జాతిని జాగృతం చేసిందని ఎంఈఓ మధుసూదన అన్నారు. ముత్తుకూరులోని ఈదూరు ఈశ్వరమ్మ జెడ్పీ హైస్కూల్లో హిందీ భాషా దినోత్సవాన్ని గురువారం ఘనంగా జరుపుకున్నారు. హిందీ భాషాభివృద్ధికి కృషి చేసిన ప్రముఖుల వేషధారణలతో విద్యార్థులు సందడి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 1949 సెప్టెంబర్ 14న కేంద్ర ప్రభుత్వం హిందీ భాషను అధికార భాషగా గుర్తించిందన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం శ్రీనివాసులురెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

**కనుపూరు పాఠశాలలో..**

**వెంకటాచలం :** మండలంలోని కనుపూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో హిందీ భాషా దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హిందీ ఆవశ్యకతను వివరిస్తూ విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలు చేపట్టారు. అలాగే హిందీ పుస్తక ప్రదర్శన నిర్వహించారు. హిందీ భాష ఆవశ్యకతను హెచ్‌ఎం మురళీమోహన్ వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

**గండవరం హైస్కూల్‌లో..**

**కొడవలూరు :** గండవరం హైస్కూల్‌లో హిందీ పండిట్ జి.నాగభూషణం హిందీ పుస్తక ప్రదర్శనను ఏర్పాటు చేశారు. దీనిని పాఠశాల హెచ్‌ఎం జి.శ్రీనివాసరావు గురువారం ప్రారంభించి మాట్లాడారు. హిందీ భాషకు ఎంతో ప్రాముఖ్యత ఉందన్నారు. విద్యార్థులు హిందీపై పరిజ్ఞానం పెంచుకోవాలన్నారు. అనంతరం 'నిజాయితీకి ఫలితం' అనే నాటకాన్ని విద్యార్థులు ప్రదర్శించారు. విద్యార్థినుల నృత్య రూపకం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. వీటికి శిక్షణ ఇచ్చిన నాగభూషణంను హెచ్‌ఎం అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్యామ్ కుమార్, సురేష్, కుసుమకుమారి, పవన్, ఖాజా హుస్సేన్, శ్రీనివాసులు, మాధవి పాల్గొన్నారు.

➡ **బుచ్చిరెడ్డిపాళెం:** నగర పంచాయతీ పరిధిలోని రామచంద్రాపురం ప్రాథమికోన్నత పాఠశాలలో హిందీ దివస్‌ను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హిందీ సాహిత్యాన్ని పరిపుష్టి చేసిన తులసీదాస్, కబీర్‌దాస్, ప్రేమ్‌చంద్ జీవిత చరిత్రను హెచ్‌ఎం సీహెచ్ శ్రీనివాసులురెడ్డి విద్యార్థులకు వివరించారు. అనంతరం వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. కార్యక్రమంలో రిసోర్స్‌పర్సన్ గండికోట సుధీర్‌కుమార్, ఉపాధ్యాయులు మున్వర్ అహ్మద్, వేదవతి, వేణు, నిర్మల, బ్రహ్మారెడ్డి, విజయకుమారి, విజయనిర్మల, వజ్రమ్మ, రసూల్‌బేగం పాల్గొన్నారు.

➡ **ఇందుకూరుపేట :** మండలంలోని గంగపట్నంలో ఉన్న జెడ్పీ ఉన్నత పాఠశాలలో హిందీ భాషా దినోత్సవాన్ని గురువారం నిర్వహించారు. అనంతరం విద్యార్థులు జాతీయ నాయకుల వేషధారణలో ఆకట్టుకున్నారు. నృత్య ప్రదర్శనలతో అలరించారు. హిందీ టీచర్ శ్రీనివాసులు పాల్గొన్నారు.





కొడవలూరు: విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న హెచ్‌ఎం వెంకటేశ్వర్లు



ముత్తుకూరు : మాట్లాడుతున్న ఎంఈఓ మధుసూదన



వెంకటాచలం : కనుపూరు పాఠశాలలో..



బుచ్చిరెడ్డిపాళెం: రామచంద్రాపురం ప్రాథమికోన్నత పాఠశాలలో..

# పేదలకు ఉచిత న్యాయసేవ

- సీనియర్ సివిల్ జడ్జి కె.వాణి



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి కె.వాణి

**ముత్తుకూరు :** పేదలు, నిరక్షరాస్యులు, ఆర్థికంగా, సామాజికంగా వెనుకబడిన వర్గాలు, మహిళలకు ఉచితంగా న్యాయసేవ అందిస్తున్నట్టు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.వాణి అన్నారు. పంటపాళెంలోని ఓ పామాయిల్ ఫ్యాక్టరీలో గురువారం జరిగిన న్యాయవిజ్ఞాన సదస్సులో ఆమె పాల్గొని, ప్రసంగించారు. న్యాయ సేవాధికార సంస్థ ద్వారా అధిక కాలం, కోర్టుల ఖర్చు భరించలేని వారికి ఉచితంగా న్యాయసేవలు అందిస్తున్నామన్నారు. అనంతరం పర్యావరణ పరిరక్షణకు తీసుకోవాల్సిన చర్యలు వివరిస్తూ, ఫ్యాక్టరీ ఆవరణలో మొక్కలు నాటారు. కాలుష్య నియంత్రణ మండలి ఈఈ సీహెచ్ రాజశేఖర్, సంస్థ ఎండీ దక్షిణామూర్తి పాల్గొన్నారు.